

చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి.



ఇసుక దోపిడీకి రంగం సిద్ధం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో సహజ వనరుల దోపిడీపై కొందరు దృష్టి సారించారు. 8లో

గరిష్టం/కనిష్టం
36.5°/ 23.3°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఉద్యమంలా మొక్కల పెంపకం

- రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



కొకుంట్ల పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ: జిల్లాలో ఉద్యమంలా చెట్లు, మొక్కల పెంపకం చేపడదామని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని కొకుంట్ల పీహెచ్‌సీ ఆవరణలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ జపనీస్ మియావాకీ పద్ధతిలో చెట్లను నాటాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. డీఎఫ్ఓ వినీత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో నీటి సంరక్షణ, మెగా ప్లాంటేషన్ కార్యక్రమాలు విస్తృతంగా చేపడతామన్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గంలోని నగర వనాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, జిల్లా అటవీశాఖ అధికారులు, కొకుంట్ల పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన వాగ్దానాలు నెరవేరుస్తాం

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్



మంత్రి సత్యకుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం టవర్‌క్లాక్: ప్రజలకిచ్చిన వాగ్దానాలు తప్పకుండా నెరవేరుస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా జిల్లాకు వచ్చిన ఆయన మంగళవారం నగరంలోని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు నివాస గృహంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ప్రజలు భారీ మెజార్టీ ఇచ్చారన్నారు. చంద్రబాబుపై నమ్మకంతో గెలిపించారని, వారి నమ్మకం వమ్ము చేయకుండా ఇచ్చిన వాగ్దానాలు నెరవేరుస్తామన్నారు. మోదీ విజన్ కారణంగానే కేంద్రంలో బీజేపీ మూడోసారీ అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో వైద్య విద్యను బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సేవలందిస్తామన్నారు. ఆరోగ్యశ్రీ నిధులు త్వరలోనే విడుదల చేస్తామని, పథకంలో అవినీతిపై విచారణ జరిపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, బండారు శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

5 రోజుల్లో వర్షాలు



బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న 5 రోజుల్లో వర్షాలు పడే అవకాశమున్నట్లు రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పగటి ఉష్ణోగ్రతలు 35.2–36.2 మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 24.8–25.8 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదు కావచ్చన్నారు.

ప్రత్యక్ష నరకం



రోగులతో కిటకిటలాడుతున్న సర్వజనాస్పత్రి ఎమర్జెన్సీ వార్డు

- జీజీహెచ్‌లో అడ్మిషన్ కోసం పడిగాపులు
- వర్ణనాతీతంగా ప్రాణాపాయ రోగుల పరిస్థితి
- నలుగురు ఆర్‌ఎంఓలున్నా పర్యవేక్షణ కరువు
- కలెక్టర్ స్పందిస్తేనే పాలన గాడిలోకి..



- ఈ ఫొటోలో కన్పిస్తున్న వృద్ధుడి పేరు పెద్దన్న. పెద్దవడుగూరు మండలం అప్పేచెర్ల గ్రామం. ఈ నెల 16న సాయంత్రం ప్రాణాపాయ స్థితిలో సర్వజనాస్పత్రి ఎమర్జెన్సీ వార్డుకు వచ్చారు. పెద్దన్నను 24 గంటలకుపైగా ఎమర్జెన్సీ వార్డులోనే వెంటిలేటర్‌పై ఉంచేశారు. వాస్తవంగా ఇటువంటి కేసులను రౌండ్ ద క్లాక్ వైద్యుల పర్యవేక్షణ ఉండే అక్యూట్‌మెడికల్ కేర్ యూనిట్‌కు తరలించాల్సి ఉన్నా తీసుకెళ్లలేదు.



- ఈ ఫొటోలో కన్పిస్తున్న యువకుడి పేరు భాస్కర్. పెనకచెర్ల యర్రగుంట్ల గ్రామం. కామెర్ల సమస్యతో రెండు రోజుల క్రితం ఎమర్జెన్సీ వార్డుకు వచ్చాడు. వైద్యులు చూడడానికి గంటల కొద్దీ సమయం పట్టింది. ఊపిరాడని స్థితిలో ఉన్న తనను పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పట్టించుకోకపోవడంతో భాస్కర్ ప్రత్యక్ష నరకం చూశాడు. పెద్దన్న, భాస్కర్‌లే కాదు.. నిత్యం ఎంతో మంది ఎమర్జెన్సీ వార్డులో గంటల తరబడి నిరీక్షిస్తూ అవస్థలు పడుతున్నారు.

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అడ్మిషన్ పొందడం గగనమవుతోంది. రోజుల తరబడి ఎమర్జెన్సీ వార్డులోనే రోగులుండే దయనీయమైన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రాణాపాయ స్థితిలో వచ్చిన రోగులను పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు చూశాకే వార్డులకు తరలిస్తుండడంతో అప్పటివరకూ వారు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. ఎప్పటికప్పుడు వార్డుల్లో పర్యటించి రోగులకు మెరుగైన వైద్య సేవలందేలా చర్యలు తీసుకోవాల్సిన ఆస్పత్రి ఉన్నతాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సిబ్బంది తమ మాట వినడం లేదని పలువురు ఆర్‌ఎంఓలు సమాధానమిస్తున్నారు. దీన్ని బట్టే ఆస్పత్రిలో పాలన ఎంత అధ్వాన స్థితికి చేరిందో అర్థం చేసుకోవచ్చు.

హెచ్‌ఓడీల ఉదాసీనత..

సర్వజనాస్పత్రిలో పలు విభాగాల హెచ్‌ఓడీలు వింత పోకడలకు తెరలేపారు. ప్రాణాపాయ స్థితిలో ఎమర్జెన్సీ వార్డుకు వచ్చే రోగులను మొదట క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ పరిశీలించి, రోగి సమస్యకు సంబంధించిన పీజీ, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు కాల్ చేస్తే వారు చూసి రక్త, ఎక్స్‌రే, అవసరమైతే సీటీ, ఎంఆర్‌ఐ తదితర పరీక్షలను అక్కడే ఉండగా చేశాక.. అవసరమైతే అప్పుడు అడ్మిట్ చేసుకుంటున్నారు. అప్పటివరకూ రోగులను అక్కడే మంచాల్లో ఉంచేస్తున్నారు. లేకపోతే వీల్‌చైర్లపై ఉంచుతున్నారు. ఈ క్రమంలో ప్రాణాపాయ స్థితిలోని రోగుల బాధ వర్ణనాతీతంగా ఉంటోంది. ఆస్పత్రికి వచ్చిన వెంటనే సంబంధిత వార్డుకు తరలించి, అక్కడ వైద్య పరీక్షలు చేయాల్సి ఉన్నా, అటువంటి పరిస్థితి కానరాకుండా పోయింది. వివిధ విభాగాధిపతుల నిర్లక్ష్యంతోనే వైద్యం అందడంలో జాప్యమవుతోంది.

కొరవడిన పర్యవేక్షణ..

సర్వజనాస్పత్రిలో రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ల (ఆర్‌ఎంఓ) స్థాయి అధికారులు నలుగురు ఉన్నారు. వీరు తమ కార్యాలయంలోనే తిష్ట వేస్తున్నారు. ఎమర్జెన్సీ వార్డులోకి వెళ్లి అక్కడి పరిస్థితులను గమనించి రోగులను సకాలంలో వార్డులకు పంపాల్సి ఉన్నా, తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎమర్జెన్సీ వార్డులో కనీస వసతులున్నాయో లేదో కూడా చూడడం లేదు. కొన్ని ఫ్యాన్లు తిరగకపోవడంతో రోగి సహాయకులు విసనకర్ర, టవాళ్లతో ఊపే దుస్థితి నెలకొంది. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అయినా స్పందించి జీజీహెచ్ పరిస్థితులను చక్కదిద్దాల్సి ఉంది.





ఇలా గంటల కొద్దీ వేచి ఉంటే గానీ సర్వజనాస్పత్రిలో అడ్మిషన్ దొరకడం కష్టం

> **చెప్పినా వినడం లేదు**
>
> రోగులను సకాలంలో అడ్మిట్ చేసుకోవాలని ప్రతి సమావేశంలోనూ చెబుతున్నాం. ఇదే విషయం గతంలోనే ప్రొఫెసర్లకు తెలియజేశాం. కొన్ని విభాగాల వైద్యులు మా ఆదేశాలు పట్టించుకోవడం లేదు. ఇకపై రోగులను సకాలంలో వార్డులకు తరలించేలా చూస్తాం.
>
> – డాక్టర్ పద్మజ, ఆర్‌ఎంఓ

ఇంటర్ సప్లి ఫలితాల విడుదల

- సీనియర్ ఇంటర్‌లో 60.69 శాతం ఉత్తీర్ణత
- ఆన్‌లైన్ మూల్యాంకనం విజయవంతం


అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను మంగళవారం ఇంటర్ బోర్డు అధికారులు విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 4,811 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2,920 మంది ఉత్తీర్ణత (60.69 శాతం) సాధించారు. మే 24 నుంచి జూన్ 1 దాకా సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. ఇంటర్‌బోర్డు చరిత్రలో తొలిసారిగా జవాబుపత్రాల మూల్యాంకనం ఆన్‌లైన్ విధానంలో చేపట్టారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం ఆన్‌లైన్‌లో పూర్తి చేశారు. ఎక్కడా చిన్న పొరబాటుకు తావులేకుండా విజయవంతం కావడం పట్ల అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు, కణేకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా, బెళుగుప్ప జూనియర్ కళాశాల 25 శాతం ఉత్తీర్ణతతో చివరిస్థానంలో నిలిచింది. వెల్ఫేర్ కళాశాలలకు సంబంధించి తిమ్మాపురం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ బాలికల జూనియర్ కళాశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించగా, బ్రహ్మసముద్రం బాలికల కళాశాల 47 శాతంతో చివరిస్థానంలో నిలిచింది.కేజీబీవీలకు సంబంధించి రాయదుర్గం, శింగనమల వందశాతం ఉత్తీర్ణత సాధించగా, 27.27 శాతంతో తాడిపత్రి కేజీబీవీ చివరిస్థానంలో నిలిచింది. మోడల్ స్కూళ్లకు సంబంధించి రాయదుర్గం, కణేకల్లు స్కూళ్లు వందశాతం ఉత్తీర్ణత సాధించగా, 20 శాతం ఉత్తీర్ణతతో యల్లనూరు చివరిస్థానంలో నిలిచింది.

యాజమాన్యాల వారీగా పరిశీలిస్తే...

యాజమాన్యం	హాజరైన విద్యార్థులు	పాసైన వారు	శాతం
ప్రభుత్వ	1,033	658	63.70
ఎయిడెడ్	353	170	48.16
వెల్ఫేర్	113	76	67.25
కేజీబీవీ	125	93	74.40
ఏపీఎంఎస్	262	179	68.32
ప్రైవేట్	2,925	1,744	59.62
మొత్తం	4,811	2,920	60.69

మిషన్ మిల్లెట్ హుళక్కేనా..?

- గత ఏడాది వరుణుడు అడ్డు
- ఈ సారి చిరుధాన్యాల సాగుపై స్పష్టత కరువు



చిరుధాన్యాల పంటలు

అనంతపురం అగ్రికల్చర్: కనుమరుగవుతున్న చిరుధాన్యపు పంటల సాగును విస్తరించాలనే సమున్నత ఆశయంతో 2023 సంవత్సరాన్ని 'ఇంటర్నేషనల్ మిల్లెట్ ఇయర్' (అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం)గా ఐక్యరాజ్యసమితి ప్రకటించినా... వరుణుడి కటాక్షం లేక అమలుకు నోచుకోలేదు. పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం, అన్నదాతల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని 'మిషన్ మిల్లెట్' పేరుతో గత ప్రభుత్వాలు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించినా వర్షాభావంతో ఆగిపోయింది. ఇవే కాదు... వేరుశనగ, కంది, ఆముదం, పత్తి లాంటి ప్రధాన పంటల విస్తీర్ణం కూడా తగ్గిపోయాయి. ఇలా మిల్లెట్ ఇయర్‌లోనే వాటి ఉనికి నామమాత్రం కావడం గమనార్హం. ఈ సారి ముందస్తుగా తొలకర్లు పడ్డాయి. ఆ తర్వాత నైరుతి రుతుపవనాల ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో ఈ సారైనా చిరుధాన్యపు పంటలు అలాగే పప్పుధాన్యపు పంటల సాగు విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయశాఖ ఎలాంటి కార్యాచరణ అమలు చేస్తాయనేది స్పష్టం కావడం లేదు.

1960–85 మధ్య చిరుధాన్యపు పంటల హవా..

అందుబాటులో ఉన్న గణాంకాలు పరిగణనలోకి తీసుకుంటే మన పూర్వీకులు పూర్తి స్థాయిలో సంప్రదాయ చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు పండించినట్లు చరిత్ర చెబుతోంది. 1960కు ముందు, ఆ తర్వాత 1985 వరకు కూడా జిల్లాలో చిరుధాన్యపు పంటల హవా నడిచింది. వేరుశనగ పంట అనేది నామమాత్రం. ఆరికలు, సామలు, ఊదలు, అండుకొర్రలు, జొన్నలు, రాగులు, కొర్రలు, సజ్జ తదితర పంటలు లక్షల ఎకరాల్లో సాగు చేసేవారు. 1961–62లో చిరుధాన్యపు పంటలు ఏకంగా 5.55 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో వేశారు. వేరుశనగ పంట కేవలం 1.94 లక్షల హెక్టార్లకు పరిమితమైంది. 1971–72లో చిరుధాన్యపు పంటల విస్తీర్ణం 4.01 లక్షల హెక్టార్లు కాగా వేరుశనగ 2.55 లక్షల హెక్టార్లలో వేశారు. 1981–82లో చిరుధాన్యపు పంటలు తగ్గుముఖం పట్టాయి. ఈ పంటలు 3 లక్షల హెక్టార్లు కాగా వేరుశనగ విస్తీర్ణం 3.74 లక్షల హెక్టార్లకు పెరిగింది. 1991–92 సంవత్సరంలో చిరుధాన్యపు పంటలు కేవలం 60 వేల హెక్టార్లకు పడిపోగా... వేరుశనగ ఒక్కసారిగా 7.35 లక్షల హెక్టార్లకు ఎగబాకింది. ఇక 2001–02లో చిరుధాన్యపు పంటలు 30 వేలకు పరిమితం కాగా వేరుశనగ 7.80 లక్షల హెక్టార్లకు చేరుకుంది. 2010–11 విషయానికి వస్తే చిరుధాన్యపు పంటలు నామమాత్రంగా 20 వేల హెక్టార్లకు పరిమితం కాగా వేరుశనగ 8.34 లక్షల హెక్టార్లలో సాగైంది. 2020–21లో అయితే 4.70 లక్షల హెక్టార్లలో వేరుశనగ, చిరుధాన్యాలు మరింత తగ్గిపోయి 12 వేల హెక్టార్లకు పరిమితం కావడం గమనార్హం. ఇలా చిరుధాన్యపు పంటల సాగు బాగా తగ్గిపోవడంతో రైతులకు వ్యవసాయం నష్టాలు తెచ్చిపెడుతోందని విశ్లేషిస్తున్నారు. అదే సందర్భంలో విచ్చలవిడిగా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం వల్ల ఆహారోత్పత్తులు విషతుల్యమై ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నట్లు చెబుతున్నారు. నేడు ఆహారపు అలవాట్లలో చిరుధాన్యపు ఉత్పత్తులకు స్థానం కల్పిస్తున్న నేపథ్యంలో ఈ పంటల సాగు విస్తీర్ణం పెంపు తప్పనిసరి అంటున్నారు. ఈ క్రమంలో గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మిల్లెట్‌బోర్డు, పల్స్ బోర్డులు ఏర్పాటు చేసి వీటి సాగుపై దృష్టి సారించింది. 2023లో అమలు చేయాల్సిన మిషన్ మిల్లెట్‌కు వరుణుడు అడ్డుతగలడంతో ఏం చేయలేని పరిస్థితి నెలకొంది. చంద్రబాబు ప్రభుత్వమైనా మిషన్ మిల్లెట్ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ తదితరులు

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: బడి ఈడు పిల్లలందర్నీ బడిలో చేర్పించేందుకు చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. తమ పిల్లలను బడికి పంపించడంలో జిల్లా యంత్రాంగానికి తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం–2009 ప్రకారం ఆరేళ్ల నుంచి 14 ఏళ్లలోపు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అందించాలని ఆదేశించారు. బాల్య వివాహాలను అడ్డుకున్న తరువాత పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ శ్రీదేవి, ఇన్‌చార్జ్ డీఈఓ నాగరాజు, బాలల పరిరక్షణ సమితి అధికారి మంజునాథ్, ప్రొటెక్షన్ అధికారి వెంకటేశ్వరి, చైల్డ్ హెల్ప్‌లైన్ కో–ఆర్డినేటర్ కృష్ణమాచారి తదితరులున్నారు.

నేడు, రేపు కేంద్ర బృందం పర్యటన

అనంతపురం అగ్రికల్చర్: గత రబీలో నెలకొన్న కరువు పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ఆరుగురితో కూడిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం (ఐఎంసీటీ) మంగళవారం జిల్లాకు చేరుకుంది. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ స్థానిక రెవెన్యూభవన్‌లో రాష్ట్ర స్థాయి కరువు పరిస్థితులపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను బృంద సభ్యులు తిలకిస్తారు. ఆ తర్వాత రెండు బృందాలుగా విడిపోయి ఒక బృందం శ్రీ సత్యసాయి జిల్లా రొద్దం మండలంలో దెబ్బతిన్న పప్పుశనగ పంటను పరిశీలించి రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. రెండో బృందం కర్నూలు జిల్లాకు వెళ్లనుంది. మళ్లీ తిరిగి గురువారం 10.40 గంటలకు విడపనకల్లు మండలం మల్లాపురం, 12 గంటలకు వజ్రకరూరు మండలం గూళ్లప్యాలెం చేరుకుని దెబ్బతిన్న పంట పొలాలు పరిశీలించి రైతులతో మాట్లాడతారు. అనంతరం 2.50 గంటలకు ఉరవకొండ మండలం నింబగల్లు, 3.40 గంటలకు కణేకల్లు మండలం సొల్లాపురం, 3.50 గంటలకు ఉరవకొండ మండలం పెద్దకొకుంట్ల గ్రామాల్లో పర్యటించనున్నట్లు వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. వ్యవసాయ, అనుబంధ శాఖలు, ఆర్ అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా తదితర ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో జరిగిన నష్టాలు, అవసరమైన సాయం కోసం కేంద్ర బృందానికి సమగ్ర కరువు నివేదిక ఇవ్వనున్నారు.

రైతు సంక్షేమానికి చర్యలు

బుక్కరాయసముద్రం: రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. 'ప్రధాన మంత్రి కృషి సమ్మాన్ నిధి' 17వ విడత నిధుల విడుదల సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 2.76 లక్షల మంది రైతులకు రూ. 55.58 కోట్లు విడుదలైందన్నారు. రైతులు వ్యవసాయంతో పాటు ఆవులు, గొర్రెలు, కోళ్ల పెంపకం చేపట్టాలన్నారు. పొలాల్లో ఫారంపాండ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని, నిరంతరం సలహాలు అందించాలన్నారు. ఉద్యాన పంటలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో కోల్డ్ స్టోరేజీ సెంటర్ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. రైతులు



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పండించిన పంటలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేలా చూస్తామన్నారు. అనంతరం పలువురు రైతులకు అవార్డులను అందజేశారు.కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరి, రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ భార్గవి, ఎంపీపీ సునీత, సర్పంచ్ నరసమ్మ, శాస్త్రవేత్తలు సుధారాణి, శశికళ, డాక్టర్ మాధవి, చందన, శశికళ, కిషోర్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పదో తరగతి పాఠ్యపుస్తకంపై ముద్రించిన బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ గోపుర చిత్రం

'బుగ్గ' ఆలయానికి ప్రత్యేక గుర్తింపు

- పదో తరగతి పాఠ్య పుస్తకంపై గోపురం ముద్రణ
- మరో సారి పాఠ్యపుస్తకాలకెక్కిన తాడిపత్రి

తాడిపత్రి అర్బన్: తాడిపత్రిలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయానికి ప్రత్యేక గుర్తింపు లభించింది. పదో తరగతి చరిత్ర సబ్జెక్టుకు సంబంధించిన భారతదేశం, సమకాలీన ప్రపంచం–1 పాఠ్యపుస్తకం కవర్ పేజీపై ఆలయ గోపురాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముద్రించడంపై తాడిపత్రివాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా 'తాడిపత్రి' ఇంటర్ పాఠ్యాంశాల్లో స్థానం సంపాదించుకుంది. ప్లాస్టిక్‌ను నిషేధించి దేశానికే ఆదర్శంగా నిలవడంతో 2008లో ఇంటర్ పాఠ్యపుస్తకాల్లో తాడిపత్రి మున్సిపాలిటీ గురించి ప్రచురించారు. ప్రస్తుతం పదో తరగతి చరిత్రకు సంబంధించిన పుస్తకంపై బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ గోపురం ముద్రించడంతో మరోసారి తాడిపత్రి వార్తల్లో నిలిచింది.



అంతరాలయంలో పూజలందుకుంటున్న బుగ్గరామలింగేశ్వర స్వామి

దక్షిణ కాశీగా ఖ్యాతి..

పెన్నా నది ఒడ్డున వెలసిన బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయం ఎన్నో ప్రత్యేకతలకు నెలవుగా భాసిల్లుతోంది. కాశీలో విశ్వనాథుడి ఆలయానికి గంగా నది ఉత్తర వాహినిగా ఉన్నట్లే, 'బుగ్గ' ఆలయానికి పెన్నానది ఉత్తర వాహినిగా ఉండడం గమనార్హం. అలాగే కాశీలో ఆలయం పక్కనే శ్మశాన వాటిక ఉన్న రీతిలోనూ ఇక్కడి ఆలయం పక్కన ఉంది. బుగ్గ రామలింగేశ్వరుడు దక్షిణాభిముఖంగా వెలసి ఉండడంతో ఆలయం దక్షిణ కాశీగా ఖ్యాతి గడించింది. త్రేతాయుగంలో యాగ పరిరక్షణలో భాగంగా తాటకిని సంహరించిన అనంతరం స్త్రీ హత్య దోష నివారణకు అప్పటికే స్వయంభుగా వెలసిన బుగ్గ రామలింగేశ్వరుడికి రామలక్ష్మణులతో కలిసి విశ్వామిత్రుడు విశేష పూజలు చేయించినట్లు ఇతిహాసం చెబుతోంది. లింగోద్భవ స్థానంలో బుగ్గ నుంచి నిరంతరం నీరు ఉబికి వస్తుండడం మరో విశేషం.

క్లుప్తంగా

కేశవ్‌కు నెట్టికంటుడి ఆశీర్వచనాలు



స్వామి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందుకుంటున్న మంత్రి పయ్యావుల కేశవ్

గుంతకల్లు రూరల్: రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖామంత్రి పయ్యావుల కేశవ్‌కు మంగళవారం ఉదయం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆశీర్వచనాలను ఆలయ అధికారులు, అర్చకులు అందజేశారు. మంగళవారం ఉదయం పెద్ద కౌకుంట్లలోని పయ్యావుల కేశవ్ ఇంటికి ఆలయ ఈఓ భద్రాజీ, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, సిబ్బంది, అర్చకులు వెళ్లారు. స్వామి తీర్థ ప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి, వేద ఆశీర్వచనాలతో దీవించారు.

భార్యపై కత్తితో దాడి



వివరాలు వెల్లడిస్తున్న మల్లీశ్వరి

గుంతకల్లు రూరల్: అనుమానం పెను భూతమై చివరకు భార్యపై కత్తితో భర్త దాడి చేసిన ఘటన గుంతకల్లు మండలంలో చోటు చేసుకుంది. వివరాలు... గుంతకల్లు సమీపంలోని దోనిముక్కల రోడ్డు ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న రంగన్నకు 12 సంవత్సరాల క్రితం మల్లీశ్వరితో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త పెయింటింగ్ పనులు, భార్య బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్నారు. పెళ్లయిన ఏడాది నుంచే భార్యను అనుమానించడమే పనిగా పెట్టుకున్న భర్త తరచూ ఆమెను వేధింపులకు గురి చేసేవాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం భార్యను నిలదీస్తూ వాగ్వాదానికి దిగిన రంగన్న... చివరకు కత్తి తీసుకుని ఆమె మెడపై దాడి చేశాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబసభ్యులు కాపాడి వెంటనే గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం ఆమె పరిస్థితి మెరుగ్గా ఉందని వైద్యులు తెలిపారు.

గొడ్డుమర్రిలో హెల్త్ క్లినిక్ శిలాఫలకం ధ్వంసం



యల్లనూరు: మండలంలోని గొడ్డుమర్రి గ్రామంలో ఉన్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్ శిలాఫలకాన్ని టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. మంగళవారం సాయంత్రం టీడీపీ నాయకులు కండక్టర్ గంగాధర్, రామాంజి, ప్రతాప్ తదితరులు హెల్త్ క్లినిక్ వద్దకు చేరుకుని శిలాఫలకాన్ని తొలగించి నేలపై పడేసినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.



● చదువు... బాధ్యత

చీకటి నుంచి వెలుగులోకి తీసుకొచ్చేది అక్షరం. మనిషి ఉన్నత స్థితికి చేరాలంటే చదువే ఆధారం. ఇలాంటి పరిస్థితుల్లో ఓ బాలుడు చదువుకుంటూనే తల్లిదండ్రుల కష్టాన్ని పంచుకుంటున్నాడు. జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో చెరువు కట్టపై మంగళవారం సాయంత్రం ఇలా రిక్షాపై మట్టి తరలిస్తూ 'సాక్షి' కెమెరాకు చిక్కాడు. కర్ణాటకలోని బళ్లారికి చెందిన తాను తల్లిదండ్రులతో కలసి ఇక్కడకు వలస వచ్చానని, ఇక్కడే 7వ తరగతి చదువుకుంటున్నట్లు తెలిపాడు. బడి వేళలు ముగిసిన తర్వాత తల్లిదండ్రులతో కలసి ఇలా పనిలో పాలుపంచుకుంటున్నట్లు వివరించాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

బడి బయటి పిల్లలను గుర్తించండి



ర్యాలీ ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ డీఈఓ నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: బడిఈడు పిల్లలందరూ బడుల్లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ డీఈఓ నాగరాజు సూచించారు. 'నేడు బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా మంగళవారం అనంతపురంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ ఏర్పాటు చేశారు. ర్యాలీని ప్రారంభించిన ఇన్‌చార్జ్ డీఈఓ మాట్లాడుతూ... బడి బయట గల పిల్లలను గుర్తించి వయసుకు తగిన తరగతుల్లో చేర్పించాలన్నారు. మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి గ్రామస్థాయిలో స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. విద్య ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. వారి పిల్లలను కచ్చితంగా బడికి పంపేలా ప్రోత్సహించాలన్నారు. గ్రామ, వార్డు వలంటీర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, ఇతర లైన్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులను ఎన్యుమరేటర్లుగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు, అనంతపురం రూరల్ మండల విద్యాశాఖ అధికారి వెంకట స్వామి, ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, అలెస్కో గోవిందరెడ్డి, విద్యాశాఖ ఏఎస్ఓ ఓబుల్ రెడ్డి, ఐఈ కో–ఆర్డినేటర్ షమా, అసిస్టెంట్ ఏఎంఓ చంద్రమోహన్ రెడ్డి, కేఎస్ఆర్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను నియంత్రించాలి





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, హాజరైన అధికారులు

- కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం

అనంతపురం అర్బన్: జిల్లాలో మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణపై మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జరిగిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మలేరియా, డెంగీ నివారణకు పారిశుద్ధ్య కల్పన, క్లోరినేషన్, స్ప్రేయింగ్, ఫాగింగ్ కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టాలని పంచాయతీ, పురపాలక సంఘాల అధికారులను ఆదేశించారు. మలేరియా సిబ్బంది సహకారంతో జిల్లాలోని సంక్షేమ శాఖల వసతి గృహాల్లో ఐఆర్‌ఎస్ స్ప్రేయింగ్ చేయించాలని సాంఘిక సంక్షేమ శాఖ జేడీని ఆదేశించారు. నీరు నిల్వ ఉండే గుంతల్లో ఆయిల్‌బాల్స్ వేయించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు తప్పక పర్యవేక్షించాలని చెప్పారు. మురికి నీరు ఎక్కువగా నిలువ ఉండే పెద్ద గుంతల్లో గంబూజియా చేప పిల్లలను వదలాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ.భ్రమరాంబదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.ఎస్.వెంకటేశ్వరరావు, మలేరియా అధికారి ఓబులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇసుక దోపిడీకి రంగం సిద్ధం!

- ఉల్లికల్లు రీచ్ వద్దకు హిటాచీ చేరవేత
- అడ్డుకున్న గ్రామస్తులు
- లారీతో పాటు హిటాచీని వదిలి ఉడాయించిన డ్రైవర్



ఉల్లికల్లు గ్రామస్తులు అడ్డుకోవడంతో లారీలోనే ఉన్న హిటాచీ

శింగనమల: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే సహజ వనరుల దోపిడీపై కొందరు దృష్టిసారించారు. ఈ క్రమంలో ఇసుక దోపిడీకి రంగం సిద్ధం చేశారు. అయితే సకాలంలో గ్రామస్తులు అప్రమత్తం కావడంతో హిటాచీని అక్కడే రోడ్డుపై వదిలేసి వెళ్లిపోయారు.

ఉల్లికల్లు రీచ్‌పై కన్ను

పెద్దపప్పూరు మండలం ఉల్లికల్లు రీచ్ నుంచి ఇసుక అక్రమ తరలింపులకు పథకం వేసినట్లుగా తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అధికారాన్ని అడ్డు పెట్టుకుని టీడీపీ నాయకులే వెనుక నుంచి మొత్తం కథ నడుపుతున్నట్లుగా స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఉల్లికల్లు రీచ్ వద్దకు హిటాచీని చేర్చేందుకు వచ్చిన లారీని స్థానికులు గుర్తించి అడ్డుకున్నారు. హిటాచీని ఎక్కడకు తీసుకెళుతున్నారని అడిగితే పెన్నానదిలోకి అని డ్రైవర్ సమాధానం ఇవ్వడంతో ఇసుక దోపిడీకి రంగం సిద్ధమైనట్లుగా గ్రామస్తులు నిర్ధారించుకున్నారు. దీంతో డ్రైవర్‌పై వరుసగా ప్రశ్నల వర్షం కురిపించారు. లారీని ఎవరు పంపారు... హిటాచీ ఎవరికి సంబంధించింది... ఇసుక తరలించాలని ఎవరు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు నిలదీయడంతో దిక్కుతోచని డ్రైవర్ లారీతో పాటు హిటాచీని అలాగే రోడ్డుపై వదిలేసి వెళ్లిపోయాడు. రెండు రోజులుగా లారీపై గ్రామస్తులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఇసుక అక్రమ తరలింపులకు పథకం రచించినదెవరో తేలాల్సిందేనని భీష్మించారు.

యువకుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

తాడిపత్రి అర్బన్: పాత కక్షల నేపథ్యంలోనే లాల్‌బాషా హత్య జరిగినట్లు తాడిపత్రి డీఎస్పీ కె.జనార్దన్‌నాయుడు వెల్లడించారు. సోమవారం నందలపాడులో జరిగిన లాల్‌బాషా హత్య కేసులోని నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేశారు. మంగళవారం రాత్రి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ నాగేంద్రప్రసాద్‌తో కలసి నిందితుడి వివరాలను ఆయన వెల్లడించారు. లాల్‌బాషా, షేక్ హాజీ మలంగ్ మధ్య ఆధిపత్యపోరు ఉండేది. 2021లో షేక్ హాజీ మలాంగ్, అతని స్నేహితులు కలసి యల్లనూరు మహమ్మద్‌పై కత్తితో దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై అప్పట్లో అర్బన్ పోలీస్ స్టేషన్‌లో మలాంగ్‌పై కేసు నమోదు చేసి రౌడీషీట్ తెరిచారు. యల్లనూరు మహమ్మద్‌కు లాల్‌బాషా బంధువు. ఈ క్రమంలో ఈ నెల 16న రాత్రి లాల్‌బాషా మద్యం మత్తులో షేక్ హాజీ మలాంగ్‌ను హతమారుస్తామంటూ నేరుగా హెచ్చరించాడు. దీంతో పథకం ప్రకారం ఈ నెల 17వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 గంటల ప్రాంతంలో ఇంటి మిద్దెపై నిద్రిస్తున్న లాల్‌బాషా తలపై మలాంగ్ గడ్డపారతో బలంగా మోది హతమార్చాడు. అనంతరం గడ్డపారను అటుగా వెళుతున్న గుర్తు తెలియని లారీలో విసిరేశాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో మలాంగ్‌ను పెద్దపప్పూరు రోడ్డులోని శ్మశాన వాటిక వద్ద అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

బాలికపై అత్యాచారం

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని ఉప్పొంక గ్రామంలో ఆరేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన బాలుడు సోమవారం అత్యాచారం చేశాడు. విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలిక అనారోగ్యంతో ఉండడంతో కళ్యాణదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు బాలిక అత్యాచారానికి గురైనట్లుగా నిర్ధారించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వైఎస్ జగన్‌ను కలిసిన జిల్లా నాయకులు



వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న శింగనమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరి సాంబశివారెడ్డి



వైఎస్ జగన్‌తో వెన్నపూస రవీంద్రారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో మంగళవారం జిల్లాకు చెందిన పలువురు నేతలు కలిశారు. భేటీ అయిన వారిలో శింగనమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరి సాంబశివారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఆర్టీసీ జోనల్ మాజీ చైర్‌పర్సన్ మంజుల, ఎస్సీ సెల్ నాయకుడు పెన్నోబులేసు, వెన్నపూస రవీంద్రారెడ్డి ఉన్నారు.



వైఎస్ జగన్‌తో ఆర్టీసీ జోనల్ మాజీ చైర్‌పర్సన్ మంజుల, పెన్నోబులేసు

అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

- దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జీఎం అరుణ్‌కుమార్‌జైన్

గుంతకల్లు: విధుల నిర్వహణలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌ఎంలకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సూచించారు. దక్షిణ మధ్య రైల్వేలోని వివిధ డివిజన్లలో అప్రమత్తంగా ఉంటూ అంకితభావంతో విధులు నిర్వర్తించిన 12 మందిని మ్యాన్ ఆఫ్ మంత్ అవార్డులకు ఎంపిక చేశారు. ఇందులో ముగ్గురు గుంతకల్లు డివిజన్‌కు చెందిన ఉద్యోగులున్నారు. ఈ క్రమంలో మంగళవారం జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ జోనల్‌లోని గుంతకల్లు, సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, నాందేడ్ డివిజన్‌లకు చెందిన డీఆర్‌ఎంలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను అభినందించారు. అనంతరం రైళ్ల కార్యకలాపాల భద్రతపై సమీక్షించారు. డివిజన్ పరిధిలో సేఫ్టీ డ్రైవ్‌ను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ఉద్యోగుల అప్రమత్తతకు, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు తరుచూ ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. లోకో పైలట్లు, షంటర్స్, ట్రాక్ మెయింటెయినర్లు, గార్డులు తదితర సిబ్బందికి ఎప్పటికప్పుడు భద్రతపై కౌన్సిలింగ్ ఇస్తుండాలన్నారు. అనంతరం జోనల్ వ్యాప్తంగా చేపట్టిన ట్రాక్ పునరుద్ధరణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గుంతకల్లు డీఆర్‌ఎం వినీత్‌సింగ్, ఏడీఆర్‌ఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటిజం పిల్లల వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్



కిట్లు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం ఎడ్యుకేషన్: మానసిక పరిపక్వత లోపం (ఆటిజం)తో బాధపడుతున్న పిల్లల వైద్య చికిత్సలపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యాధికారులకు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సూచించారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం 'ఆటిస్టిక్ ప్రైడ్ డే' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ... మానసిక పరిపక్వత లోపం కలిగిన పిల్లల కోసం 'జిల్లా త్వరిత చికిత్సా కేంద్రం' ఏర్పాటు చేశారన్నారు. పుట్టుకతో లోపం ఉన్న పిల్లలందరికీ చికిత్సలు అందిస్తూ ఎంతో మంది పిల్లలను సాధారణ స్థితికి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ వైద్య సేవలు జిల్లాలోని మారుమూల గ్రామాలకు సైతం తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు మాట్లాడుతూ... ఆటిజంతో బాధపడుతున్న పిల్లలకు తల్లిదండ్రులు ఎక్కువ సమయం కేటాయించాలన్నారు. పిల్లలకు ఇష్టమైన క్రీడలు, విద్యను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. తద్వారా పిల్లల్లో మానసికంగా, శారీరకంగా ఎదుగుదల ఉంటుందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భ్రమరాంబదేవి మాట్లాడుతూ... పుట్టుకతో లోపంతో వచ్చే అనేక మంది పిల్లలకు సరైన చికిత్సలు, థెరపీ, శస్త్ర చికిత్సల ద్వారా నయం చేస్తున్నామన్నారు. సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... ఇప్పటి వరకూ 548 మంది పిల్లలు ఆటిజం నుంచి బిహేవియర్ మోడిఫికేషన్ థెరపీ ద్వారా రికవరీ అయ్యారన్నారు. మిగతా పిల్లలు ఫాలో అప్ ట్రీట్మెంట్‌లో ఉన్నారన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి. నారాయణస్వామి మాట్లాడుతూ... పుట్టుకతో వచ్చే లోపాల గల పిల్లలను వెంటనే డీఈఐసీ సెంటర్‌కు తీసుకొచ్చి రికవరీ అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓలు డాక్టర్ పద్మజ, హేమలత, సునీత, ఆచార్యులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ వైద్యనాథ్, డాక్టర్ రామస్వామి నాయక్, డీఈఐసీ జిల్లా మేనేజర్ రజిత, పీడియాట్రీషియన్ శ్రీవిద్య, క్లినికల్ సైకాలజిస్ట్ సుందరరావు, స్పీచ్ థెరపిస్ట్ గీత, ఆప్టోమెట్రిస్ట్ జ్ఞాన ప్రసన్న, స్పెషల్ ఎడ్యుకేటర్ చంద్రకళ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ చేతుల మీదుగా పిల్లల తల్లిదండ్రులకు కిట్లు అందజేశారు.

కాలువ ఇలా.. నీరు పారేదెలా?

- పూర్తిగా కూలిన పీఏబీఆర్ లింక్ కెనాల్ రెగ్యులేటర్
- మరమ్మతులు చేపట్టి సజావుగా నీరు పారేలా చర్యలు తీసుకోవాలంటున్న రైతులు




ధ్వంసమైన పీఏబీఆర్ లింక్ కెనాల్ షట్టర్లు, సిమెంట్ దిమ్మలు

ఉరవకొండ: ఉమ్మడి జిల్లాకు తాగు, సాగునీటి వరప్రసాదినిగా ఉన్న పీఏబీఆర్ లింక్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్ పూర్తిగా కూలిపోయింది. షట్టర్లు ధ్వంసమై, లైనింగ్ సైతం పెచ్చులూడి కాలువలో నీరు పారేందుకు వీలు లేకుండా అడ్డుపడ్డాయి. ఉరవకొండ మండలం మోపిడి వద్ద ఈ దుస్థితి నెలకొంది. ఈ హెడ్ రెగ్యులేటర్ వద్ద నుంచే కర్ణాటకలోని తుంగభద్ర డ్యాం నుంచి జిల్లాలోని పీఏబీఆర్, మిడ్‌పెన్నార్ డ్యాంలకు నీటిని మళ్లిస్తుంటారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు నీరు అందాలంటే లింక్ కెనాల్ ఎంతో ముఖ్యంగా మారింది. మోపిడి నుండి పీఏబీఆర్ వరకూ 11 కిలోమీటర్ల పొడువునా కాలువ నిర్మాణం జరిగింది. లింక్ కెనాల్ సాధారణ నీటి సామర్థ్యం 1,600 క్యూసెక్కులు ఉంటుందని పీఏబీఆర్ అధికారులు చెబుతున్నారు. లింక్ కెనాల్ ద్వారా అనంతపురం నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలోని 1,800 గ్రామాలకు తాగునీరు అందుతుంది. దీంతో పాటు పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా 42 చెరువులకు సాగు నీరు అందించాల్సి ఉంది. ఇటీవల భారీ వర్షాల కారణంగా పీఏబీఆర్ లింక్ కెనాల్ షట్టర్లు, సైడ్ వాల్ పూర్తిగా ధ్వంసమై నీరు సజావుగా పారేందుకు వీలు లేకుండా శిథిలాలు అడ్డుపడ్డాయి. ఈ పరిస్థితుల్లో కనీసం 500 క్యూసెక్కుల నీటిని అందివ్వడం కష్టమేనన్న వాదనలు వినవస్తున్నాయి. దీనిపై అధికారులు స్పందించి తక్షణమే నిర్మాణ పనులు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు. దీనిపై పీఏబీఆర్ డీఈఈ విశ్వనాథ్ మాట్లాడుతూ.. పీఏబీఆర్ లింక్ కెనాల్ మరమ్మతులకు అనుమతులు కోరుతూ ప్రభుత్వానికి నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న షట్టర్లు, సిమెంట్ దిమ్మెలు తొలగించి తాత్కాలికంగా నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చేస్తామన్నారు. శాశ్వతంగా షట్టర్లు నిర్మించడానికి ప్రభుత్వం నుంచి అనుమతులు పొందాల్సి ఉందన్నారు.













● ప్రకృతి రమణీయత

మానవ నాగరికతకు మొదటి మెట్టుగా చెప్పుకునే వ్యవసాయం.. ఒక రకంగా మనిషికి ప్రకృతి ప్రసాదించిన వరం. దుక్కి దున్ని, విత్తు నాటి, పంట పండించే వరకూ అన్ని విషయాల్లోనూ రైతుకు ప్రకృతి సహకరిస్తుంది. సమయాన్ని బట్టి ప్రకృతిలో చోటు చేసుకునే వాతావరణ మార్పులు రైతుకు, చేనుకు ఎంతో మేలు చేకూరుస్తాయి. వ్యవసాయంలో పంటను నాశనం చేసే చీడపీడలు, కీటకాలే కాదు, రైతుకు దన్నుగా నిలిచే పురుగులూ ఉన్నాయి. ఇలాంటి వాటిలో మొదటగా చెప్పుకోవాల్సింది ఆరుద్ర పురుగులు. అలాంటి అరుదైన ఆరుద్ర పురుగులు పుట్టపర్తి పరిసరాల్లో కనువిందు చేస్తున్నాయి. పొలాల్లో కనిపిస్తున్న ఈ పురుగులను చూసి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– పుట్టపర్తి రూరల్:

క్లుప్తంగా

మంత్రి కేశవ్‌ను కలిసిన ఖజానా ఉద్యోగులు



మంత్రి కేశవ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఖజానా ఉద్యోగుల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఖజానా ఉద్యోగుల సంఘం నాయకులు కలిశారు. మంత్రిని ఆయన నివాసంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పెనుబోలు శంకరనారాయణ, ఇతర నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కేంద్రంలోని ఉప ఖజానాధికారి బోయ పాటి అనంతయ్య, తదితరులు ఉన్నారు.

మెరిట్ విద్యార్థినికి నగదు ప్రోత్సాహం



నాగశ్రీ తల్లిదండ్రులకు నగదు ప్రోత్సాహం అందజేస్తున్న ప్రొఫెసర్ రాజేష్

కనగానపల్లి: మండలంలోని చంద్రాచర్లకు చెందిన రైతు నాగభూషణ్ కుమార్తె నాగశ్రీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదివి 576 మార్కులు సాధించింది. మండల టాపర్‌గా నిలిచిన నాగశ్రీకి దాత ప్రొఫెసర్ రాజేష్ రూ.50 వేలు నగదు ప్రోత్సాహం అందించారు. ఇందులో భాగంగానే మంగళవారం వారి గ్రామానికి వెళ్లి విద్యార్థినితో పాటు వారి తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో రాజేష్ ఎడ్యుకేషనల్ బృందం సభ్యులు సుబ్రమణ్యం, ఆదినారాయణ, గ్రామస్తులు ముత్యాలు, రమేష్, రమణ పాల్గొన్నారు.

లబ్ధిదారులందరికీ పౌష్టికాహారం



లబ్ధిదారులకు పౌష్టికాహారం అందిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య తెలిపారు. మంగళవారం మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని అందించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా రాగి పిండి రెండు కిలోలు, బెల్లం 250 గ్రాములు, చెక్కి 250 గ్రాములు, ఖర్జూరం 250 గ్రాములు, అటుకులు కిలో, కోడిగుడ్లు 25 , పాలు 2.5 లీటర్లు, బాలామృతం 2.5 కిలోలు తప్పనిసరిగా అందజేయాలన్నారు. మండలంలో ఎక్కడైనా సమస్యలు ఎదురైతే తప్పనిసరిగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

వ్యక్తిపై కేసు నమోదు

యాడికి(పెద్దవడుగూరు): మద్యం మత్తులో ఇంటిపై రాళ్లతో దాడికి పాల్పడిన ఘటనలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పెద్దవడుగూరు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు గ్రామ మాజీ సర్పంచు హరినారాయణకు, అదే గ్రామానికి చెందిన రమణకు కొంత కాలంగా భూ సమస్యలున్నాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి రమణ మద్యం సేవించి హరినారాయణ ఇంటిపై రాళ్లతో దాడి చేశాడు. మంగళవారం హరినారాయణ ఫిర్యాదు మేరకు రమణపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చీనీ కాయల వాహనం బోల్తా



బోల్తా పడిన ఐచర్ వాహనం

గార్లదిన్నె: మండల కేంద్రంలోని గార్లదిన్నె - శింగనమల క్రాస్ సమీపంలో మంగళవారం చీనీ కాయల వ్యాన్ బోల్తా పడింది. పోలీసుల వివరాలు మేరకు.. గార్లదిన్నె నుంచి చీనీ కాయల లోడ్‌తో వెళ్తున్న ఐచర్ వాహనం శింగనమల క్రాస్ సమీపంలోకి రాగానే డ్రైవర్ షడన్ బ్రేక్ వేయడంతో వాహనం రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవ్వరికి ఎలాంటి గాయాలు కాలేదు. చీనీ కాయలు నేలపాలవడంతో రైతుకు నష్టం వాటిల్లింది.

జూదరుల అరెస్టు

యాడికి: పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.5,120 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని రాయలచెరువు గ్రామ సమీపంలో కొంతకాలంగా పేకాట ఆడుతున్నారనే సమాచారం రావటంతో పోలీసులు మంగళవారం పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ సందర్భంగా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు.

ఆస్థాన కొలువులు ఎవరికో?

పోస్టింగుల కోసం పైరవీలు..

- అమాత్యుల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు
- చక్రం తిప్పుతున్న దిగువస్థాయి నేతలు
- అన్ని శాఖల్లోనూ అనుయాయులకే పెద్దపీట
- ఏ సీటుకు ఎవరొస్తారో..?



రాయదుర్గం: ఇటీవల సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. రాష్ట్రంలో ఈనెల 4న నూతనంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. ఇంకేముంది ఎన్నికల విభాగంలో పాల్గొన్న అధికారులకు త్వరలో స్థాన చలనం ఉండబోతుంది. ఈ నేపథ్యంలో తమకు నచ్చిన సీటు రిజర్వ్ చేసుకునేందుకు ఉద్యోగులు విశ్వ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునేందుకు ఓ వైపు పైరవీలు.. మరోవైపు వారి చుట్టూ ప్రదక్షిణలు జోరందుకున్నాయి.

జిల్లాలో ఇప్పటికే రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, విద్యాశాఖ ముఖ్య విభాగాల్లోని కుర్చీలు ఓ కొలిక్కి వచ్చినట్టు సమాచారం. అప్పుడే దిగువ స్థాయి నేతల నోట సీఐ ఎవరు..? ఎస్‌ఐ ఎక్కడి నుంచి వస్తారు..? తహసీల్దార్, ఎంపీడీఓ ఎవరై ఉంటారు..? అనే చర్చ జోరుగా సాగుతోంది. ఎన్నికలకు మూడు నెలల ముందు వచ్చిన కొందరు అధికారులు ఇక్కడి వాతావరణం కాస్త అలవాటు పడినవారు ఉన్నారు. తమకు ఏ పార్టీతోనూ సంబంధం లేదు. ఓ ఏడాది లేదా రెండేళ్ల పాటు కొనసాగే అవకాశం ఇప్పించాలని ఎమ్మెల్యేలకు అత్యంత సన్నిహితులు, ప్రధాన అనుచరుల చుట్టూ పైరవీలు సాగిస్తున్నారు. ప్రయత్నాలు ఫలించేట్టు కనిపించక సర్దుకునే బాటలో ఉన్నట్టు సహ ఉద్యోగులు మాట్లాడుతున్నారు. ఏ కార్యాలయం వద్దకు వెళ్లినా ప్రస్తుతం ఇదే హాట్ టాపిక్‌గా మారింది. జిల్లా కలెక్టర్, ఎస్పీ మొదలు అన్ని విభాగాల్లోని అధికారులకు స్థాన చలనం తప్పదనే ప్రచారం ఊపందుకుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సమన్యాయంతో వెళ్లిన అధికారులకూ స్థాన చలనం జాబితాలో మొదటి వరుసలో ఉంటారన్న ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యేలు ఎవరికి పచ్చజెండా ఊపుతారో వేచి చూడాల్సి వస్తోంది.

అప్పుడే హడావుడి..?

గ్రామాల్లో ఎఫ్‌పీ షాఫ్ డీలర్లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, ఉపాధి క్షేత్ర సహాయులు, ఆశా వర్కర్లు, ఐకేపీ యానిమేటర్లు, బ్యాంకు మిత్రలు, వలంటీర్లు ఇలా ఏవీ వదలకుండా మార్పు జరిగేలా క్షేత్ర స్థాయిలోని పార్టీ కేడర్ మొత్తం సమాయత్తమైంది. ఇప్పటికే పలువురు స్వచ్ఛందంగా వదిలి వెళ్లగా, మరికొందరిపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమం మొదలైంది. ఈ పోస్టులన్నీ టీడీపీ సానుభూతి పరులకు దక్కేలా దిగువ స్థాయి శ్రేణులు చక్రం తిప్పుతున్నారు. ప్రభుత్వం మారింది కాబట్టి ఇది సర్వసాధారణమని కొందరు భావిస్తున్నారు. ఏది ఏమైనా పోస్టింగుల కోసం కొందరు, ఉన్న ఉద్యోగాలను కాపాడుకునేందుకు మరరి కొందరు అమాత్యుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ బిజీగా కనిపిస్తున్నారు.

స్కియాడ్‌కు నిధులు విడుదల చేయాలి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అకడమిక్ డెవలప్‌మెంట్ (స్కియాడ్)కు నిధులు విడుదల చేసి పునరుద్ధరించాలని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కే హుస్సేన్ రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. పోటీ పరీక్షలు, నైపుణ్య శిక్షణా సదుపాయాలు కల్పించి, ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపిన స్కియాడ్ ప్రస్తుతం అంధకారంలో ఉందన్నారు. డీఎస్సీ, గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలకు సన్నద్ధమయ్యే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సరైన శిక్షణ ఇచ్చేలా స్కియాడ్‌కు నిధులు కేటాయించాలని విన్నవించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రామకృష్ణ, ఓబులేసు, నారాయణ స్వామి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖ మంత్రిని కలిసిన డీఎంహెచ్‌ఓ



మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ దేవి

అనంతపురం ఎడ్యుకేషన్: కొత్త ప్రభుత్వంలో వైద్య,ఆరోగ్య,వైద్యవిద్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి మంగళవారం కలిశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టి జిల్లాకు తొలిసారి వచ్చిన సందర్భంగా సిబ్బందితో కలిసి డీఎంహెచ్‌ఓ మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

బధిర విద్యార్థులకు ‘అమ్మ’ చేయూత



ఆర్థిక చేయూతనందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: నగరంతో పాటు పలు గ్రామీణ ప్రాంతాల్లో వినికిడి సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి చేయూతనందించారు. మైసూరుకు చెందిన ప్రముఖ ఆడియాలజిస్టు డాక్టర్ సత్యకుమార్, ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ బాలకుమార్ సూచనల మేరకు అమ్మ సంస్థ అధ్యక్షుడు రమణారెడ్డి సైమన్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొని, చిన్నారుల కోసం అడ్వాన్సు హియరింగ్ ఎయిడ్ ఒక్కొక్కరికి రూ.18 వేలు చొప్పున మొత్తం 15 మందికి రూ.2.70 లక్ష అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదుల్లో వినికిడి సమస్య ఉన్నవారు సరిగ్గా పాఠాలు అర్థం చేసుకోలేక ఇబ్బంది పడుతున్న వారికి అమ్మ సంస్థ ఆసరాగా నిలుస్తుందన్నారు. భవిష్యత్తులో వారి విద్య, వైద్య ఖర్చులు కూడా భరిస్తుందని భరోసా ఇచ్చారు. మైసూరుకు వెళ్లి రావడానికి అక్కడ ఉండడానికి తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు.

అనుమతులు లేని కళాశాలను సీజ్ చేయాలి



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: అనుమతులు లేకుండా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఎదురుగా నిర్వహిస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్యా సంవత్సరం ప్రారంభమైన వెంటనే అనుమతులు లేకున్నా ప్రైవేటు కళాశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయన్నారు. మార్కెట్ యార్డుకు ఎదురుగా ఉన్న బాలికల జూనియర్ కళాశాలకు అనుమతులు లేకపోయినా అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. కళాశాల పేరుతో ముద్రించిన పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్నారన్నారు. కాసులకు కక్కుర్తి పడుతున్న ఇంటర్ విద్య అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధు, తరిమెల గిరి, నగర అధ్యక్ష కార్యదర్శులు శివ, భీమేష్, నాయకులు సోము, వివేక్, రాజేష్, నిరంజన్, మహేష్, చందు, మహేష్, పరమేష్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పీడబ్ల్యూడీ కార్యాలయ ఆవరణలో ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నాక్) నైపుణ్య కేంద్రంలో స్థానిక నిరుద్యోగ యువతకు ల్యాండ్ సర్వేయర్, ఎలక్ట్రీషియన్ కోర్సులకు సంబంధించి రెండు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్ పాసై 16 నుంచి 35 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన నిరుద్యోగ యువత ఈ ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 20 లోపు స్కిల్ సెంటర్‌లో ఏడీ గోవిందరాజులును సంప్రదించి విద్యార్హత, ఆధార్, రేషన్‌కార్డు, రెండు ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 7013858450, 9908620306 నంబర్లలో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

శుభవార్త సభలు జయప్రదం చేయండి

పామిడి: పట్టణంలోని బైపాస్‌లోని హనుమాన్‌లింక్ రోడ్డు సర్కిల్ సమీపాన శాశ్వత కృపా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈనెల 24, 25, 26 వతేదీల్లో నిర్వహించే అందరికి రక్షణ శుభవార్త సభలను జయప్రదం చేయాలని నిర్వాహకులు పీటర్ విజయ్, విజయ్‌ఛార్లెస్, ప్రభాకర్ ఛార్లెస్ మంగళవారం తెలిపారు. సభలకు ముఖ్య ప్రసంగీకులుగా గుంటూరు యూదా మినిస్ట్రీస్ పాస్టర్, దైవజనులు నెహెమ్యా విచ్చేస్తారన్నారు.

గంగమ్మ ఆలయంలో పూజలు



అలంకరణలో గంగమ్మ అమ్మవారు

తాడిపత్రి టౌన్: మండలంలోని గంగాదేవిపల్లె సమీపంలో ఉన్న గంగమ్మ ఆలయంలో మంగళవారం పూజలు నిర్వహించారు. భక్తులు హాజరై అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రజలందరూ ప్రేమతో మెలగండి

కళ్యాణదుర్గం రూరల్: ప్రజలందరూ ప్రేమతో మెలగాలని అంతర్జాతీయ ప్రసంగీకులు, సువార్తీకులు దీవెనయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో రెండో రోజు సువార్త ఉజ్జీవసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ప్రసంగీకులు దీవెనయ్య బైబిల్ సందేశం ఇచ్చారు. రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత బ్రదర్ చల్లా కిశోర్, పాస్టర్ బసవరాజు, మైనార్టీ నాయకులు రవికుమార్, జోసెప్ కిశోర్, స్వరూప్ కుమార్, రోజ్లీ రాజేష్, పాస్టర్ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో బాలకృష్ణుడు

పెద్దపప్పూరు: మండలకేంద్రంలోని పురాతన కృష్ణస్వామి ఆలయంలో మంగళవారం బాలకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి నెలా ఏకాదశి, ద్వాదశి రోజుల్లో స్వామిని గ్రామస్తులు దర్శించుకోవడం ఇక్కడ ఆనవాయితీ. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఉపాధిలో వింతలు

- పాత గుంతలకు కొత్త ఐడీలు
- మస్టర్లలో బినామీ పేర్లు
- జేబులు నింపుకుంటున్న సిబ్బంది



పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

యల్లనూరు: అడిగేవారు లేరని ఉపాధి హామీ పథకంలో అందినకాడికి దోచేస్తున్నారు. పాత గుంతలకు కొత్త ఐడీ నెంబర్లు క్రియేట్ చేసి రూ.కోట్లు దండుకుంటున్నారు. గ్రామాల్లో పెద్ద రైతు కుటుంబాల సభ్యులు ఉపాధి పనులకు హాజరు కాకున్నా మస్టరులో హాజరు వేస్తూ, కూలీల ఖాతాలో పడిన నగదును ఫీల్డ్ అసిస్టెంట్లు పంచుకుంటున్నారు. మండలంలో 21 పంచాయతీలు ఉండగా ఐదారు పంచాయతీల్లో మాత్రం తక్కువ అవినీతి ఉంది. మిగిలిన పంచాయతీల్లో కూలీల శ్రమను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఒక సేద్యపుకుంట తవ్వేందుకు 10 మంది కూలీలు హాజరైతే పనులకు రాని మరో 10 మంది కూలీల పేర్లు రాసి మస్టరును నింపుతారు. వచ్చిన కూలి సొమ్ములో సగం రాసిన వారికి మిగిలిన సగం కూలీలకు.. ఇలా అవినీతికి అంతు లేకుండా పోతోంది. మీకెందుకు మామూళ్లు ఇవ్వాలి? అని ప్రశ్నిస్తే పనులు లేకుండా చేస్తున్నారని కూలీలు వాపోతున్నారు. కూలీలు చేసిన పనులకు మెజర్‌మెంట్ వేసి ఎంబుక్ రికార్డులు చేసి బినామీ పేర్ల వాళ్లకు కూలీల సొమ్మును పంచుతున్నారు. కొందరు టెక్నికల్ అసిస్టెంట్లు ఈ అవినీతికి కేరాఫ్‌గా మారారు. మండల స్థాయి, ఏపీఓ స్థాయి అధికారి నిజాయితీగా నిలుస్తుంటే మిగిలిన కొందరు ఉద్యోగులు ఆడింది. ఆట పాడింది పాట అన్న చందంగా ఉంది. యల్లనూరులో మండల కేంద్రంలో ఓ సీనియర్ మేటు వద్ద పెద్దఎత్తున జాబ్‌కార్డులు పెట్టుకుని తమ శ్రమను దోచుకుంటున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. మస్టరుకు 12 మంది కూలీలు హాజరైతే మేట్లు 20 మంది పేర్లు రాస్తూ ఆదాయాన్ని అర్జిస్తున్నారు. మిగిలినదంతా ఫీల్డ్ అసిస్టెంట్లకు వాటాగా ఇవ్వాలి. 21 పంచాయతీల్లో రోజూ సుమారు 4,500 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. 20 శాతం మస్టర్లల్లో బోగస్ పేర్లు ఉన్నాయి. అక్రమాలపై కలెక్టర్ వినోద్‌కుమార్, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి స్పందించి విచారణ చేపట్టాలని కూలీలు కోరుతున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు

ఉపాధి పనుల్లో అవినీతికి కొందరు అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు వత్తాసు పలుకుతున్నారు. పాత గుంతలకు ఐడీ నెంబర్లు క్రియేట్ చేసి చెక్ మెజర్ చేస్తూ పబ్బం గడుపుతున్నారు. ప్రతి పనికి ఒక రేటు పెట్టుకుని సొమ్ము చేసుకుంటున్నారు. జాబ్‌కార్డుకు ఒక రేటు, ఎంబుక్ రికార్డులకు ఒక రేటు, మస్టరుకు ఒక రేటు పెట్టుకున్నారు. ప్రధానంగా టెక్నికల్ అసిస్టెంట్లు మండలంలో పాతుకుపోవడంతో అవినీతికి అంతులేకుండాపోతోంది. ఏసీబీతో ఆస్తులను విచారిస్తే అవినీతి బయటపడుతుంది. అలాగే ప్రతి బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సమావేశాలు జరుగుతున్నా కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లలో చలనం లేదు. వారి తీరు మారడం లేదు. అలాగే కొందరు సమావేశాలకు రాకున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. సమావేశాల్లో చర్చించిన అంశాలను కూడా ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తుంగలో తొక్కుతున్నారు.

మస్టరు తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం



యల్లనూరు మండలంలో ఉపాధి పనులపై విచారణ చేస్తాం. మస్టరు తనఖీలు చేసి బినామీ పేర్లు రాయకుండా చర్యలు తీసుకుంటాం. బినామీ పేర్లు రాస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పదేపదే సమావేశాల్లో చెబుతున్నాం. ఆరోపణలు రుజువైతే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– ఏపీడీ వెంకటరత్నం తాడిపత్రి

అంతా అవినీతే..



మస్టర్లల్లో పనులకు రాని వారి పేర్లు రాసుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. ఉపాధి పనులకు వెళ్లిన కూలీలకు అన్యాయం చేస్తూ పనులకు వెళ్లని వారికి న్యాయం చేయడం విడ్డూరంగా ఉంది. మాలాంటి పేదలకు అన్యాయం చేస్తే ఏం వస్తుంది? మా గ్రామంలో జరిగిన ఉపాధి పనుల్లో ఉద్యోగులంతా కుమ్మకై అవినీతికి తెర లేపారు.

– ప్రసాద్,ఉపాధి కూలీ, 85 నిట్టూరు

ఖాళీ సీట్లకు 87 దరఖాస్తులు

పామిడి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో ఖాళీ ఉన్న 1,4,1 చొప్పున 6 ఖాళీ సీట్లకు సంబంధించి 87 దరఖాస్తులు వచ్చినట్లు ప్రిన్సిపాల్ అరుణ మంగళవారం తెలిపారు. అందులో 7, 8 తరగతులకు 35 చొప్పున, 9వ తరగతికి 17తో కలిపి మొత్తం 87 దరఖాస్తులు అందాయన్నారు. ఈ నెల 19న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మెరిట్ ఆధారంగా ఖాళీ సీట్లను భర్తీ చేస్తామన్నారు. అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చిన్నమట్లగొందిలో వైద్య శిబిరం

శింగనమల: మండలంలోని చిన్నమట్లగొందిలో జ్వరాలు ప్రబలడంతో మంగళవారం తరిమెల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శంకర్ నాయక్, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వర పీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ గంగాధర్, ఏఎన్‌ఎం పద్మావతి, ఆశ వర్కర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగులో అన్నదాతల బిజీ



కసాపురంలో వేరుశనగ విత్తనం విత్తుతున్న దృశ్యం



నెలగొండలో విత్తనశుద్ధి చేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందే పదునైన వర్షాలు పడడంతో పంట సాగు పనుల్లో రైతన్నలు బిజీ అయ్యారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటపొలాల్లో వర్షపు నీరు నిలిచి పంటసాగుకు ఇబ్బందిగా మారింది. వర్షాలు తగ్గుముఖం పట్టి నాలుగు రోజులుగా మళ్లీ ఎండలు ప్రారంభం కావడంతో అన్నదాతలు ఖరీఫ్ సీజన్ పంటసాగు పనులను ఆరంభించారు. మండలంలో దాదాపు 45 వేల ఎకరాల సాగుభూమి ఉండగా ఏటా దాదాపు 30 వేల ఎకరాల్లో వేరుశనగ పంటనే ప్రధాన పంటగా సాగుచేసేవారు. కానీ గత కొన్నేళ్లుగా వేరుశనగ పంట దిగుబడులు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో రైతన్నలు ఎక్కువశాతం కందిసాగుపై మొగ్గు చూపుతున్నారు. గత ఏడాది దాదాపు 15 వేల ఎకరాల్లో వేరుశెనగ పంటను సాగు చేయగా.. 20 వేల ఎకరాల్లో కందిపంటను సాగు చేశారు. మరో 10 వేల ఎకరాల్లో ఆముదం, పత్తి, జొన్న, సజ్జ, మొక్కజొన్న తదితర పంటల సాగు చేపడుతున్నారు. ఈ ఏడాది ముందస్తు వర్షాలను దృష్టిలో ఉంచుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌కు దాదాపు 20 రోజుల ముందుగానే రైతన్నలకు సబ్సిడీ విత్తన వేరుశనగను పంపిణీ చేసింది. మండల వ్యాప్తంగా దాదాపు 3,750 మంది రైతులకు 3,570 క్వింటాళ్ల విత్తన వేరుశనగను పంపిణీ చేశారు. అదేవిధంగా 10 క్వింటాళ్ల కందులను కూడా రైతులకు పంపిణీ చేశారు. గత కొద్ది రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాలు గత వారం రోజులుగా తెరపి ఇవ్వడం, పొలాల్లో తేమ తగ్గి పంటసాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడటంతో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ రైతన్నలు ఖరీఫ్ పంటసాగు పనుల్లో నిమగ్న మయ్యారు. రెండు రోజుల వ్యవధిలోనే మండలంలో 2 వేల ఎకరాల్లో కంది, మరో 1,500 ఎకరాల్లో వేరుశనగ పంటసాగును చేపట్టారు.